'స్వాతి' వారపత్రిక - 23.7.1993

# ప్రేమ యాత్ర

హౌరా-మద్రాసు మెయిల్ బయల్దేరడానికి సిద్ధంగా వున్నది.

కంపార్టుమెంట్ ఎంట్రెన్సు వద్ద సుజాత నిల్చొని వున్నది. ఆమె మరోసారి పద్మ, కిషోర్‌లకు జాగర్తలు చెబుతున్నది. వాళ్లిద్దరూ ఆమె పిల్లలు. మల్లెపూవుల్లా గుబాళిస్తున్నారు.

సుజాత వెనుకనే కృష్ణ వున్నాడు. అతడు ఆమె భర్త. స్త్రీత్వానికి ఒక తేజోవంతమైన ప్రతీకలా ఆమె వుంటే, అతడు గంభీర సుందర విగ్రహంతో, చిరుదరహాసంతో చూడచక్కగా వున్నాడు.

చెప్పిన జాగర్తలనే పదిసార్లు చెబుతున్న తల్లి హెచ్చరికలను పిల్లలు వినలేక ఇబ్బందిగా కదులుతున్నారు. రైలు కదులుతోంది.

"మమ్మీ! మా గురించి ఎలాంటి బెంగా వద్దు. మాకేం ఫర్వాలేదు. లేనిపోని ఆలోచనలతో టైము వృధాపరచకు... ఎంజాయ్ దిస్ ట్రిప్" అంది పద్మ.

"ఆల్ ది బెస్ట్"

తల్లిదండ్రులను హృదయపూర్వకంగా విష్ చేశారు పిల్లలు.

సుజాత సిగ్గుతో వంగిపోయింది మందార మొగ్గలా.

హాపీ జర్నీ అని విష్‌చేయవచ్చుకదా! ఎంజాయ్ దిస్ ట్రిప్ ఏవింటీ? ఏమి కాలమో! ఏమి పిల్లలో!

రైలు స్పీడందుకుంది. చేతులు ఊపుతున్న పిల్లలు ఆమెకు దూరమవుతున్నారు.

'మీరు లేకుండా - నేను ఎంజాయ్ చేయగలిగింది ఏముందర్రా - నా మొహం' అనుకుంది. మాతృహృదయం బరువెక్కింది.

"మీరొక్కపని చేయరు కదా! మనతో బాటు పిల్లలూ వస్తే ఎంత బాగుండేది. మిమ్మల్ని ఏం అనాలో అర్థం కాదు" - చిరాకు, కోపం సుజాతలో.

"అదే అర్థమవుతుంది... ముందు లోపలికి పద"

స్ప్రింగ్ డోర్‌ని తోసి - సుజాతను లోపలికి తీసుకువెళ్లాడు కృష్ణ.

మంత్రించినట్టుగా, అకస్మాత్తుగా ఏ గంధర్వ లోకానికో ప్రవేశించినట్టనిపించింది ఆమెకు. కార్తీకమాసపు మలయపవన వీచికల్లా - హాయి గొలిపే చల్లటి గాలి ఆమెపై జల్లున

కురిసి, తడిపేసి ముద్ద చేసి - మధనపడుతున్న ఆమె మనసుని సేదతీర్చేయి. మండుతున్న గుండెను చల్లబర్చేయి.

గమనించేడు కృష్ణ. కాగల కార్యం గంధర్వులు తీర్చడమంటే ఇదేనేమో! తను ఆమెను ఎలా ఉపశమింపచేయాలా అని అనుకున్నది కొంత ఈ సెకండ్ క్లాస్ ఎ.సి. బోగి సహకరించి పుణ్యం కట్టుకుంది.

తను ఏదో పుష్పక విమానం ఎక్కినట్టు, అది నదీనదాలని దాటుకుంటూ, జలతారు మబ్బుల్ని దూసుకుంటూ, తారలతో ముచ్చటిస్తూ స్వర్గంలోకి పయనిస్తున్నట్టుగా వుంది సుజాతకి. ఒక స్థితి నుంచి మరో స్థితికి దూసుకుపోతున్న రాకెట్‌లా ఆమె మనసు నుండి పిల్లల దిగులు పటాపంచలై - ఏసీ ఇస్తున్న సుఖాన్ని ఆస్వాదిస్తోంది.

ఎన్నో కబుర్లు భర్త కమ్మగా చెప్పగా - హాయిగా విన్నది. మధ్యమధ్యలో వేసిన జోకులకి ముసిముసిగా, స్వేచ్ఛగా తనివితీరా నవ్వింది. భర్త అసలు తనతో ఇలా కబుర్లు చెప్పడమే ఆమె కెంతో అద్భుతంగా, పరమానందంగా వుంది. పదహారేళ్ళ వైవాహిక జీవితంలో భర్తతో ఇలా సరదాగా గడిపిన మధుర క్షణాలు ఎన్ని వుంటాయి? చాలా తక్కువ. అంచేతనే ఆమెకు ఏ ఒక్కటీ గుర్తుకు రాలేదు. సుజాతకి ఉత్సాహంగా వుంది.

కిటికీలోంచి కదలిపోతున్న చెట్లనీ, చేలనీ, కొండలనీ, కోనలనీ, కోనేటి సరస్సులనీ, కొంగల బారునీ, వెండిమబ్బు తునకలనీ తన్మయంగా చూస్తూ కూర్చుంది. అలా ఎంత సేపైనా కూర్చోగలననిపించింది ఆమెకు.

క్రమక్రమేణా తనకు చలి ఎక్కువైనట్టుగా ఫీలయింది. చీరను నిండుగా కప్పుకొని, రెండు చేతులను గుండెలకు అడ్డంగా కట్టుకుంది. రగ్గు జోలికి వెళ్ళలేదు. ఆమెకు ఆ చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

ఇలాంటి యాత్ర కోసం ఇన్నాళ్ళూ కలలు కనినట్టు, తపించినట్టు ఆమెకు గుర్తులేదు. భర్తతో ఏకాంతం కోసం పరితపించిపోవడం మటుకు గుర్తుంది - అదీ పెళ్ళయిన తొలిరోజుల్లో.

శ్రీవారితో ఏకాంతం అనేది ఆ ఇంట్లో సాధ్యం కాని విషయం అని ఆమెకు అతి తొందరలోనే అనుభవమయింది. క్లోజ్‌డ్ వరండాతో కలిపి ఒకే ఒక గది గల చిన్న ఇల్లు - సొంతదే. పెళ్ళికెదుగుతున్న ముగ్గురు ఆడపడుచులు. అత్తగారు! ఆ ఇరుకు ఇంట్లో భర్తతో ఏకాంతం ఎట్లా లభ్యమవుతుంది?

కోడలుగా ఆ ఇంట్లో తన గౌరవానికి భంగం కలగలేదు. అత్తా, ఆడపడుచులు తనని వాళ్ళలో ఒకతెగా స్వీకరించేరు. అది అదృష్టంగా భావించింది కూడా.

మావగారు లేకపోవడంతో - కుటుంబ బరువు అంతా తన భర్త మీదే పడింది. అది తన బాధ్యతగా స్వీకరించేడు. జీవితం అంతా కటకటే. కష్టాలతోనే సాగింది. ఇప్పుడిప్పుడే కొంత తేరుకుంటున్నారు.

పిల్లలతో, వచ్చీ వెళ్ళిపోయే ఆడపడుచులు, వాళ్ళ సంతతితో ఇల్లు ఎప్పుడూ సందడే. ఉద్యోగం పెద్దదే అయినప్పటికీ - ప్రతి నెలా జీతం చాలక ఆ మాత్రం అప్పో సప్పో చేయక తప్పని స్థితి. అయితే అవి భయంకరమైన కుష్టుమచ్చల్లాంటి అప్పులు కావు. ఏ నెలకానెల తీరిపోయేవి. ఇన్‌స్టాల్‌మెంట్లతో కరిగిపోయేవి. అప్పులేని మధ్యతరగతి వుండునా?

యల్.టి.సి. (లీవ్ ట్రావెలింగ్ కన్సెషన్) నాలుగేళ్ళ కొకసారి ఉపయోగించుకోవచ్చు. దీనికి కూడా ఎన్‌కాష్‌మెంట్ ఫెసిలిటీ వుంది. అంచేత అది కూడా ఎప్పటికప్పుడు డబ్బుగా మారి - ఇంటి ఖర్చులకు జమైపోతున్నది.

ఈసారి మాత్రం ఒక నిశ్చయానికొచ్చి యల్.టి.సి. ఆవైల్ చేసుకోవడానికే నిర్ణయించేడు కృష్ణ.

అతనికి సుజాత అంటే అమితమైన ప్రేమ. సుజాత కాకుండా మరెవరైనా స్త్రీ ఆమె స్థానంలో వుంటే - తనకి తలనొప్పిగా మారి నరకం సృష్టించి వుండేదని అతని నమ్మకం. ఆమె విశాల హృదయంతో తన పిల్లలతో సమానంగా అత్తా, ఆడపడుచులను ఆత్మీయంగా చూసుకోవడం అతనికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్న విషయం. అలాంటి అదృష్టం చాలా కొంతమంది భర్తలకే లభిస్తుందని అతని భావన.

సుజాత ఏనాడూ తనని పెద్ద పెద్ద కోరికలు కోరలేదు. పట్టుచీరలూ, నగలూ అంటూ పట్టుపట్టలేదు. ఏ నెలా,, రెణ్ణెల్లకో ఒక సినిమాకి తీసుకువెళ్తే మురిసిపోయే అల్పసంతోషి. అలాంటి భార్యకి తన ప్రేమనైనా సరిగా అందిస్తున్నాడా అనేది అతని అనుమానం.

ఆమెను ఈ రొటీన్ నుంచి, బందెల దొడ్డి నుంచి బయటకు లాగి తన ప్రేమను పంచాలని, జీవితం యొక్క రెండోవేపు ఆమెకు చూపించాలని అతని తాపత్రయం. ఈ విషయంలో తను ఇప్పటికే క్షమించరాని ఆలస్యం చేశాడు.

ఇంతా చేస్తే - అతని ప్రపోజలుకు ఒప్పుకోలేదు సుజాత.

"యల్.టి.సి. వద్దండీ. వాళ్ళు ఇచ్చేది రైలు ఛార్జీలే. మనకి అయ్యేది బోల్డు ఖర్చు. కన్నె వుంది గదాని ఆవును కొన్నట్టు అవుతుంది. అప్పు చేసి ఎవరెళ్ళమన్నారు చెప్పండి?"

"అప్పు కాదు. ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నారు కంపెనీ వారు. దానితో వెళ్తున్నాం"

"వద్దు. దానితో అప్పు కొంత తీర్చివేద్దాం"

"తీర్చేసినా, మన అప్పు ఊటబావి లాంటిది. ఎందుకో ఒకందుకు అది ఊరుతూనే వుంటుంది. మనకిది మామూలే. నా మాట కాదనకు. ఇంటి చాకిరీ చేసి చేసి ఎంత అలసిపోయేవో నీకు తెలీదు. నీకు రిలాక్సేషన్ అవసరం కాదనకు".

"ఇప్పుడు వద్దండి. పిల్లల చదువులు డిస్టర్బ్ అవుతాయి"

"అది నాకు తెలుసు. కేవలం మనమిద్దరమే వెళ్తున్నాం"

నివ్వెరపోయింది సుజాత.

"మీకేమైన మతిపోయిందా. ఏదైన ఊరూ, వింత ఎదిగే పిల్లలకి చూపించండి నాక్కాదు.

నాకన్నీ అయిపోయేయి."

"ముప్ఫయి మూడేళ్ళకే నీకన్నీ అయిపోయేయా! ఆడదానికి అసలు సిసలు కోడె వయసు ముప్ఫయ్యేళ్ళ తర్వాతేనట! తెల్సా!"

"ఏవిటో మీరీవేళ చిత్రంగా మాటాడుతున్నారు. పిల్లల గురించి నేనంటుంటే..."

"పిల్లల గురించి నేనొక ఏర్పాటు చేశాను. మీ అన్నయ్య రాంబాబు వున్నాడా? మా కంపెనీలోనే అఘోరిస్తున్నాడు కదా. తను పిల్లలతో సమ్మర్‌లో యల్.టి.సి. మీద మద్రాసు వెళ్తున్నాడు. మన పిల్లలు అతనితో వెళ్తారు. అందుకు ఒప్పుకున్నాడు కూడా. కుటుంబ సభ్యులు అలా దశల వారీగా వెళ్ళే సదుపాయం యల్.టి.సి.లో వుంది."

"మా అన్నయ్యతో కలిసి మనమందరమూ సమ్మర్‌లోనే వెళ్దాం"

"ఏడ్చినట్టుంది – ఈ నరక కూపం నుంచి రెండ్రోజులు బయటకొచ్చి కాస్త ఊపిరి తీసుకోమంటే అర్థం కాదేం?"

"జాగర్తగా మాటాడండి. నా ఇల్లు నాకు స్వర్గమే గాని – నరకకూపం కాదు"

"అవును బురదలో పంది కూడా అలానే అనుకుంటుంది."

ఏడ్చేసింది సుజాత.

వదల్లేదు కృష్ణ.

"నీవు నీ కోసంకాకపోయినా – నా కోసమైనా నాతో రావాలి తప్పదు"

"నేను రాను" అంది మొండిగా సుజాత.

ఎంతగా నచ్చచెప్పినా, బతిమాలినా వినకపోవడంతో ఆమెతో మాట్లాడటం మానేశాడు కృష్ణ కోపంతో.

చివరికి అది ఇంట్లో పెద్ద ఇష్యూగా మారింది. అత్తగారు అర్థం చేసుకొని నెమ్మదిగా కోడలిని ఒప్పించేరు. పిల్లలు – మేము మామయ్యతో తర్వాత వెళ్తాం – నీవు డాడితో వెళ్ళమని తల్లిని సతాయించేరు. బ్రతిమాలేరు.

సుజాత 'ఊఁ' కొడితే తప్ప – కృష్ణ ఆమెతో మాటాడలేదు.

సుజాత రైలు ఎక్కడానికి – ఇంత కథ నడిచింది.

గంపతో జాంపళ్ళు కుర్రాడు అరుచుకుంటూ వచ్చేడు.

నిద్రలేచి, వాడిని పిలిచేడు కృష్ణ

రాజమండ్రి జాంపళ్ళు అంటే సుజాతకి ఎంత ఇష్టమో అతనికి తెలుసు.

అతను కొన్నాడు. ఆమె తృప్తిగా తిన్నది.

తింటూ, రైలు చప్పుడు విని పారిపోతున్న రెండు నక్క పిల్లల్ని అద్దంలోంచి కృష్ణకి చూపించింది. చూశాడు కృష్ణ.

"అవి నక్కలు కాదు. కుక్కలు" అన్నాడు.

"చాల్లెండి. కొండా కోనల్లో కుక్కలు వుంటాయా? అవి ఖచ్చితంగా నక్కలే"

"ఏసీ అద్దాల్లోంచి..అలా తారుమారుగా కన్పిస్తాయి" అన్నాడు.

సుజాత 'వ్వెవ్వెవ్వే' అని వెక్కిరించి – నవ్వింది.

ఆ నవ్వంటే ఇష్టం కృష్ణకి.

ఆమెను తనివి తీరా చూస్తూ– "నీకోమాట చెప్పనా" అన్నాడు.

"చెప్పండి. మరిక పనేముంది?"

"నీవు పెళ్ళిపీటల మీద అలనాడు ఎలా వున్నావో, ఈనాడు కూడా అలానే వున్నావు. శరీరం కాస్త సాగినా – బిగువు, బింకం కోల్పోలేదు. ముఖవర్చస్సు మాత్రం అలానే చెక్కుచెదరకుండా వుంది."

"నక్కల్ని ఎందుకు కుక్కలన్నారో ఇప్పుడర్థమైంది నాకు. మీరు వెంటనే డాక్టరుకి కళ్ళు చూపించుకోవడం అవసరం."

"సరే! నాది దృష్టి లోపం... అదిగో ఆ బెంగాలీ బాబుని లేపి నీ వయసెంత వుంటుందో చెప్పమన్నా?"

"మధ్యలో ఆ పిడత మొహంగాడు ఎందుకు?– మీరే చెప్పండి. పయిటలేస్తున్న పదిహేనేళ్ళ కూతురికి తల్లినన్నది గుర్తుపెట్టుకొని మరీ చెప్పండి"

"అదే మరి – పద్మకి నీవు తల్లిలా వుండవు. అక్కలా వుంటావు. పాతికేళ్ళ పరువాల యువతిలా"

"అందుకేనన్నమాట! నాతో పిల్లలని రానీయలేదు"

"అబ్బా! ఆ కేసెట్‌ని రిపీట్‌చేయకుండా వుండలేవా?"

"మీరెన్ని చెప్పండి. మీతో ప్రయాణం నాకు బాగుంది. కాదనడం లేదు. కాని పిల్లలు కూడా మనతో వుంటే ఇంక బాగుండేది"

కృష్ణ మరిక మాటాడలేదు. వారపత్రిక అందుకున్నాడు. రాత్రి తెచ్చుకున్న పులిహోర తిని – ఇద్దరూ చెరో బెర్తు మీద నిద్ర కుపక్రమించేరు.

తెల్లవారక ముందే రైలు మద్రాసు చేరింది.

ఆటో ఎక్కి రెండు, మూడు లాడ్జీలు తిరిగితే గాని వాళ్ళకి రూము దొరకలేదు.

ఆటోవాడితో పేచి. చివరికి పాతిక రూపాయలు ఇస్తేగాని ఊర్కోలేదు వాడు. చాలా అసహ్యంగా బిహేవ్ చేశాడు.

సుజాతకి బాధ అనిపించింది – ఏవిఁటో! కష్టాలు కోరి తెచ్చుకోవడం అంటే ఇదే. హాయిగా ఇంటి దగ్గరే వుండి ఇంటిల్లిపాది ఏ సినిమాకో వెళితే సరిపోయేది కదా!

భర్త నుంచి అంతకన్నా ఎక్కువ స్థాయి సుఖం కోరుకోనూ లేదు. ఆశించనూ లేదు తను.

డబల్ రూమ్. అటాచ్డ్ బాత్.

మూడు వందల అడ్వాన్స్ చెల్లించి, లెడ్జరులో వివరాలు రాసి సంతకం పెట్టాడు కృష్ణ.

రూమ్ తాళం తీశాడు బాయ్.

రూమ్ పెద్ద విశాలంగా లేకపోయినా – నీటుగా వుంది. రెండు పరుపు మంచాలు, పెద్ద నిలువుటద్దం, రెండు ఛైర్లు. ఒక టీపాయ్. కూజాతో నీళ్ళు. రెండు గ్లాసులు.

బాత్రూం తలుపు తెరిచి చూసేడు కృష్ణ. విశాలంగా వుంది. పెద్ద అద్దం. బేసిన్, షవర్, వెస్టర్న్ లావెట్రీ... ఫర్వాలేదు బాగానే వుందనిపించింది.

మంచంపై భార్యాభర్తలు కూర్చున్నారు – రిలాక్సింగ్‌గా.

"రెండు మంచాలు! పిల్లలూ వస్తే ఎంచక్కా సరిపోయేది" అంది.

తల కొట్టుకున్నాడు కృష్ణ. ఆమెను దగ్గరగా తీసుకొని "ఈ గదిలో నీ మొగుడ్ని తప్ప మరెవర్ని తలచినా నేనొప్పుకోను" అని సీరియస్‌గా తెలియజేశాడు.

"చాల్లెండి. అటూ, ఇటూ చూసుకోకుండా ఏవిఁటా సరసం! చేతులు తీయండి. ఇది ఇల్లు కాదు".

"సరసమా! సరిసరి. ఇంటి దగ్గర నీ పై చేయి వేసే అవకాశం కూడానా! ఇది ఇల్లు కాదు గనకనే ధైర్యంగా, స్వేచ్ఛగా నిన్ను దగ్గరకు తీసుకోవడం... ఇకపోతే ఇక్కడ ఎవడూ తలుపు తట్టడు – బజ్జర్ కొట్టి పిలిస్తే తప్ప. అర్థమయిందా. ఇక స్నానం చేసి వేగిరం బయల్దేరు. మద్రాసు చూసివద్దాం" అన్నాడు కృష్ణ.

తలంటుకొని పట్టుచీరలో దిగొచ్చిన దేవతలా మెరిసిపోతున్న సుజాత సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను సమీపించి పెదాలను ముద్దుపెట్టుకోబోయేడు కృష్ణ.

అందుకు అవకాశం ఇవ్వకుండా తప్పుకొని – "పదండి వెళ్దాం" అంది సుజాత.

టూరిస్ట్ బస్‌పై ఉదయం నుంచీ సాయంత్రం వరకూ మద్రాసు నలుమూలలా తిరిగేరు. ఆమెకు మ్యూజియం వగైరాల కన్నా గుళ్ళూ, గోపురాలూ, స్నేక్‌పార్కులు నచ్చేయి. టూరిస్టు బస్ అన్ని ప్రదేశాలు తిప్పి చివరి మజిలీగా మెరీనా బీచ్ దగ్గర దించేసి వెళ్ళిపోయింది.

దంపతులిద్దరూ బీచ్ అందాలని తిలకించేరు. సముద్రపు కెరటాలని పలకరించేరు. చాలా సమయం అక్కడ గడిపి – లాడ్జికి తిరిగి రాబోయేటప్పటికి ఏడు గంటలయింది.

మంచాలపై బడలికతో వాలిపోయేరు. బాయ్‌ని పిలిచి రెండు టీలు తెప్పించుకు తాగేరు.

"సుజీ! స్నానం చేసేస్తే నీరసం ఎగిరిపోతుంది" అన్నాడు కృష్ణ.

"నాకు చేసే ఓపిక లేదు బాబు – మీరే చేయండి"

బట్టలు విడిచి టవల్ కట్టుకొని బాత్రూంకి వెళ్ళేడు కృష్ణ.

వీపు తోమడానికి రమ్మని కేకవేశాడు కృష్ణ – బాత్రూమ్ నుంచి.

"ఇదెక్కడి కొత్త అలవాటండీ బాబూ! నేను రాను" అంది సుజాత.

మూడు నాలుగు సార్లు పిలిపించుకొని.. బద్ధకంగా లేచి బాత్రూంలోకి అడుగు పెట్టిన సుజాత 'కెవ్'మని అరిచింది.

షవర్ కింద దుస్తుల్లేకుండా స్నానం చేస్తున్నాడు కృష్ణ.

గభాల్న ఆమె బాత్రూం నుంచి బయటపడబోతుంటే - ఆమెను ఉడుంపట్టుతో షవర్ కిందికి లాక్కుపోయేడు. అతని కౌగిట్లో పూర్తిగా బందీ.

షవర్ కింద ఆ రెండు శరీరాలు కోడెత్రాచుల్లా మెలికలు తిరిగిపోయేయి.

ఇపుడు ఆమె ప్రపంచమంతా ఒక పురుషుడూ, అతను ఇచ్చే సుఖం. పులకరింతలు. కేరింతలు. పరవశంతో పలవరింతలు.

జలక్రీడలో ఎంతసేపు అక్కడ గడిపారో వాళ్ళకే తెలీదు.

ఇద్దరి శరీరాలు అలసిపోయేయి. అయితే ఎక్కడ లేని ఉత్సాహం. ఎనలేని ఆనందం. అలౌకికమైన, అనంతమైన తృప్తి. ఏదో పందెంలో, పోటీలో విజయం సాధించినట్టు అనుభూతి. ఇద్దరూ విజేతలే.

బాయ్ చేత మీల్స్ తెప్పించేడు కృష్ణ.

సుజాత కృష్ణకి తినిపించింది. కృష్ణ సుజాతకి తినిపించేడు.

బోయ్ టీపాయ్ క్లీన్ చేసి, ఎంగిలి ప్లేట్లు తీసుకుపోయేడు.

ఇక హాయిగా నిద్రపోదామని ఒకరికొకరు అనుకున్నారు. కాని వాళ్ళు పడుకునేటప్పటికి అర్ధరాత్రి దాటింది. వాళ్ళకి వయసు గుర్తురాలేదు. శృంగారానికీ వయసేమిటి?

ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ భయం భయంగా, పొడి పొడిగా అనాసక్తిగా మొక్కుబడిగా సాగిన సెక్సు... ఈ రోజు నిర్భయంగా, నిర్మలంగా, అత్యంత ఉత్సాహంగా, అమిత సుఖంగా సాగింది.

తనలో కోరిక తీవ్రత ఇంతగా వుందని, కృష్ణ అంతగా చెలరేగిపోతాడని అనుకోలేదు సుజాత. తన నరనరాల్లో పేరుకుపోయిన కరుడు గట్టిన జడత్వాన్ని బూజు దులిపి దుమ్ము రేపాడు. సెక్సు పట్ల తనలో ఆవహించిన నిరాసక్తి, నిర్లిప్తత, వైరాగ్యాలను దుల్లగొట్టి పటాపంచలు చేసి శృంగారమంటే కొత్త భాష్యం చెప్పాడు. మోడుని మళ్ళీ చిగురింపచేశాడు.

కేవలం తనొక్కతినే, పిల్లలతో కాకుండా ఎందుకు తీసుకువచ్చిందీ ఇప్పుడు అర్థమయింది సుజాతకి. అవును. కొన్ని అనుభవంతోగాని అర్థం కావు.

అనంతంగా సాగిన పదహారేళ్ళ వైవాహిక జీవితంలో తనీవిధంగా సుఖపడినట్టు గుర్తులేదు. తొలిరాత్రి శోభనం నాడు కూడా ఈ పులకరింపు, జలదరింపు లేవు. ఈ రోజు నూటికి నూరుపాళ్ళు తను తృప్తి చెంది, కృష్ణకి అంతకి రెట్టింపు తృప్తి ఇచ్చాననే సంతృప్తి ఆమెలో.

ఇన్నాళ్ళూ తను సెక్సు లేకుండా గడిపిందా? లేదు. తరచు సెక్సు వుండేది. అయితే అది ఆ ఇంట్లో అన్నిటిలా రొటీన్‌గా సాగే తంతుగా ముగిసేది - రసహీనంగా, భయంగా, కక్కుర్తిగా.

అది క్రమేణ ఆమెలో శృంగార వైరాగ్యానికి వైముఖ్యానికి దారితీయసాగింది.

ఆ ప్రమాదం పసిగట్టి, ఆలస్యంగానైనా మేలుకున్నాడు కృష్ణ. ఆ తర్వాతే ఈ ప్రేమయాత్ర.

ఆ రోజే కాదు - వరుసగా మూడు రోజులు సరస శృంగార సమరంలో అమర సుఖాన్ని అనుభవించేరు అక్కడ. ఒక అనుభవం నుంచి మరో అనుభవం. దేనికదే కొత్త. దినాలు క్షణాలుగా దొర్లిపోయేయి.

మరుసటి రోజు ఉదయమే కోరమాండల్ రైలు ఎక్కాలనే తలంపు - ఆమె గుండెల్లో గుబులు దిగులుగా మారింది. ఆ రాత్రి తను నిద్ర పోలేదు. కృష్ణని నిద్ర పోనీయలేదు.

అతన్ని గట్టిగా వాటేసుకొని "మనం వెళ్ళొద్దండీ" అని ఏడ్చేసింది.

"బాగుంది. ఎన్నాళ్ళిక్కడ వుండిపోతాం... అవతల పిల్లలు మన కోసం బెంగతో ఎదురు చూస్తుంటారు" అన్నాడు కృష్ణ.

"నాకు పిల్లలూ కావాలి. ఈ సుఖమూ కావాలి"

"దానికి ఒకటే పరిష్కారం"

వేగిరం చెప్పమంది సుజాత.

"ప్రేమయాత్రకు ఇలా బృందావనాలు, నందనవనాలూ చెక్కర్లు కొట్టనీయవు మన ఆర్థిక పరిస్థితులు, నాకు వచ్చే నెలలో కంపెనీ క్వార్టర్ అలాట్ అవుతున్నది. మూడు పెద్ద గదులు, వరండా, వంటగది, పట్నానికి దూరం అయితేనేం... పచ్చని చెట్ల మధ్య చాలా విశాలంగా అన్ని సదుపాయాలతో వుంటుంది. మన ఇల్లు అద్దెకిచ్చేసి క్వార్టరుకి వెళ్ళిపోదాం. మన ఇద్దరికీ ప్రత్యేకించి గది వున్న గృహమే కదా స్వర్గసీమ! ఏమంటావు?"

"అబ్బ! ఎంత తీయటి వార్త చెప్పారండి. మనకొక గది ఖచ్చితంగా వుండాలి. ప్రయివేసీ వుండాలి. క్వార్టరుకి వెళ్ళిపోదాం"

"అలాగే! కాని ఆలోచించవలసింది ఒకటుంది. దీని వల్ల మనం నెల నెలా వచ్చే హౌస్‌రెంటు అలవెన్స్ కోల్పోతాం. మన ఇల్లు ఏ 300 రూపాయలకి అద్దెకి ఇచ్చాం అనుకున్నప్పటికీ... అటూ, ఇటూ లెక్కలు వేసి చూస్తే.. క్వార్టర్సుకి వెళ్ళడం వల్ల మనకి నెలనెలా ఆదాయంలో వంద రూపాయలు నష్టపోతాము. మన ఇంటి పరిస్థితులకు ప్రతి రూపాయి ఎంత విలువైనదో సంసారం ఈదుతున్న నీకు నాకన్నా బాగా తెలుసు. ఏం చేద్దాం?" అన్నాడు కృష్ణ.

'అమ్మో! అయితే వద్దండి' అన్లేదు సుజాత.

"ఇంత ఖర్చులో...వంద రూపాయల కోసం మనం చూసుకోవద్దండి. గృహ బడ్జెట్ నుంచి... ఏవో కొన్ని మినహాయించి మానేజ్ చేస్తాను. అది నాకు వదిలేయండి. మనం క్వార్టర్స్‌కి వెళ్ళిపోదాం".

సుజాత అతనికి కొత్తగా కనిపించింది.

ఆ సుజాతే అతనికి కావాలి.